

# అపార్థం

## పి. వెంకటేశ్వర్లు

**సౌమ్య నన్ను చూసీచూడనట్లుగా వెళుతుండడం కొంచెం ఆశ్చర్యాన్నే కలిగించింది. పదిహేను రోజుల క్రితం ఆ అమ్మాయి యూనివర్సిటీ లైబ్రరీలో కలిసినప్పుడు 'పరీక్షలు దగ్గరపడుతున్నాయి ఇక ఇంటి దగ్గరే చదువుకుంటాను' అని చెప్పింది. అలాంటి సౌమ్య వారం రోజుల్లో పరీక్షలు పెట్టుకొని ఇప్పుడు లైబ్రరీకి బయలుదేరడాన్ని నేను మొదట నమ్మలేకపోయాను. ఇప్పుడు నన్ను చూసీ చూడనట్లుగా వెళ్లే ప్రయత్నం చేయడం మరోరకమైన ఆశ్చర్యం నాకు.**

సరే!

ఇదేం పట్టించుకోకుండా నేనే కొంచెం చొరవగా ఎదురు వెళ్లబోయాను.

ఇక తప్పదన్నట్లుగా ఆమె నావైపుకు కదిలింది.

ఆ రాకలో కూడా రైలు క్రాస్ అవుతున్న భారం ఆమెలో. వచ్చి ఒక్కక్షణం నిలబడిందో లేదో వెంటనే "వెళతాను సార్" అంది.

ఆ చిన్నమాటనే కూడగట్టుకొని పలికిన ధ్వని.

నేనేదో చెప్పబోయేలోపే మళ్లీ అదే పదాన్ని రిపీట్ చేయడంతో అప్రయత్నంగానే ఆమె ముఖంలోకి చూశాను.

ముఖంఅంతా కందగడ్డలా మారిపోయి ఉంది. ఏదో ఆలోచించి అలసిపోయినట్లున్న కళ్లు. చిందరవందరగా జుత్తు.

ఇంతకుముందు నేనెప్పుడు చూడని ఆమె అవతారం అది.

"ఏమైంది సౌమ్య ఆరోగ్యం బాగా లేదా...? అలా ఉన్నావేం...!" అన్నాను కొంచెం ఆశ్చర్యం, కంగారు కలగలిసిన గొంతుతో.

ఆమె ఏం మాట్లాడలేదు... నిర్లిప్తంగా నిలబడింది.

నా మాటల్నేం వినిపించుకునే స్థితిలో కూడా లేదని గ్రహించడానికి ఎక్కువ టైం పట్టలేదు. ఇక తన మూడ్ బాగాలేదేమోననుకొని "మళ్లీ ఎప్పుడైనా మాట్లాడుకుందాం" అంటూ వెళ్లమన్నట్లుగా తలూపాను.

అదోలా నవ్వి ఆమె అక్కణ్నించి వెళ్లిపోయింది.

సౌమ్య అవమానభారాన్ని అణచుకొని మాట్లాడుతుందని, ఆ అవమానం నావల్ల జరిగిందేనని నేనప్పుడు ఊహించలేకపోయాను.

యూనివర్సిటీలో ఎంసీఏ చదువుతున్న సౌమ్య నేను ఎక్కడ ఎదురైనా పరుగెత్తుకొని వచ్చి మాట్లాడేది. మాట్లాడుతున్నంతసేపూ స్కూల్ మధ్యలో అమ్మానాన్నల్ని కలిసిన చిన్నారుల ఆనందం ఆమెలో వ్యక్తమయ్యేది. అటువంటి సౌమ్యలో ఉన్నట్టుండి ఏదో స్పష్టమైన మార్పు... ఆమె వెళుతున్నవైపే కాసేపు చూస్తూ నిలబడ్డాను. అలా చూస్తున్నకొద్దీ నాలో ఆందోళన క్రమంగా పెరిగింది. ఏం జరిగిందో తెలుసుకోవాలనే క్యూరియాసిటీ నన్ను నిలువనియ్యలేదు. యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ముందు పెట్టిన స్కూటర్ తీసి సంశయంగానే ఫాలో అయ్యాను. ఇంకా లైబ్రరీకి చేరుకోకముందే ఆమెను అడ్డగించి మళ్లీ మాట్లాడబోయాను.

ఊంహూం... ఆమె ధోరణిలో మార్పు లేదు.

సౌమ్య ప్రవర్తన ఈసారి కోపమే తెప్పించి ఉంటుంది. అందుకే గద్దించినట్లుగా ఆగమన్నానేమో!

దారిలో ఏదో అడ్డొచ్చి ఆగిన లోడ్ వెహికిలా ఆమె అతికష్టంగా ఆగింది.

సంభాషణలో ఉపోద్ఘాతం అవసరం లేని సందర్భం అది.

నిజానికి ఆ క్షణం నాకొక వరం. న్యూస్‌రీడర్ సూటిగా వార్తల్లోని ముఖ్యాంశాలు చదివినట్లు సంభాషణ ప్రారంభించాను.

"నువ్వు ఏం చెప్పకపోతే నీ విషయంలో నేనేదో తప్పుచేశానని బాధపడాల్సి వస్తుంది. అలాంటిది ఒకవేళ ఏదైనా జరిగి ఉంటే అందుకు వెరీసారీ" అన్నాను అభ్యర్థిస్తున్నట్లుగానే.

తలెత్తకుండానే ఆమె ఈ రెండు మాటల్ని విని, ఏదో గుర్తుకు వచ్చినదానిలా మళ్లీ ముందుకు కదులుతూ అంది.

"మీరిక నాతో మాట్లాడకండి సార్. ప్లీజ్ సార్" అని.

ఈ మాటలు ముందే అనుకున్నవై ఉంటాయి. ఆమె తేలిగ్గానే అనేసి వెళ్లగలిగినా ఆ మాటల్లోని నిర్దాక్షిణ్యం, కాఠిన్యం నన్ను నివ్వెరపరచాయి.

ప్రేమికుల మధ్య సర్వసాధారణమైన ఈ సన్నివేశం నాకు పెద్ద షాక్... అప్పటికే అటుఇటుగా వెళుతున్న ఒకరిద్దరు మా మూమెంట్స్‌ను గమనించనే గమనించారు. వాళ్లెవరు చూసినా చూడకపోయినా అక్కడి ప్రతిచెట్టూ, పుట్టా నన్ను చూసినట్లుగా ఫీలయ్యాను.

నా హాస్టల్ జీవితం చాలాకాలం ఈ యూనివర్సిటీలోనే గడచింది. ఎమ్మే చదువు, ఆ తరువాత పిహెచ్‌డి, యూనివర్సిటీ ఉద్యోగపు ఎదురుచూపులు అన్నీ ఇక్కడే.

యూనివర్సిటీలో నా విద్యార్థి జీవితం ఎంతకాలం గడచినా ఎవరిని ప్రేమించిందీ లేదు. భంగపడిందీ లేదు. పూర్తిగా అటువంటి సన్నివేశాన్ని గుర్తుకు తెచ్చే ఈ అనుభవం నాకు పూర్తిగా కొత్త. యూనివర్సిటీలో మామూలుగా తిరిగినప్పుడు మనుషులతో, వాకింగ్‌కు వెళ్లినప్పుడు పరిసరాలతో నాకు స్నేహం ఏర్పడింది. నేను యూనివర్సిటీలో అడుగుపెట్టినప్పుడు నాటిన మొక్కలెన్నో ఇప్పుడు మహావృక్షాలుగా మారి నన్ను పలకరిస్తాయి. అందుకే అవన్నీ ఇప్పుడు నన్ను చూసి నవ్వినట్లుగా గిల్టీగా ఫీలయ్యాను. అన్నిటికీ మించి... నాకు స్టూడెంట్‌గా పరిచయమైన వ్యక్తితో ఈ అవమాన పరాభవం.

** ** **

అగ్రీ కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా పని చేసే నాకు సెకండ్ లాంగ్వేజిగా తెలుగు సబ్జెక్టు తీసుకున్న విద్యార్థుల పట్ల సహజంగానే అభిమానం. తెలుగు మీడియం విద్యార్థులు తెలుగు సబ్జెక్టును, ఇంగ్లీషు మీడియం విద్యార్థులు సంస్కృతాన్ని ఎక్కువగా ఇష్టపడతారు. ఇష్టపడతారని కూడా అనలేం! ఎందుకో చేరతారు!! హిందీ, ఉర్దూ తీసుకునేవారి తీరు మళ్లీ వేరే ఉంటుంది. తరగతిలో వీరి సంఖ్యను పెంచుకోవడానికి మేం చేసే ట్రిక్కులు ఒక్కొక్కసారి బిజినెస్ పర్సన్స్ చూపే ఆఫర్లను తలపిస్తాయి. ఎప్పుడూ చార్టులు, డస్టర్లు ఉపయోగించక పోయినా, ఇటువంటి సందర్భంలో మాత్రం కొన్ని పేపర్ కటింగ్‌లు ముందు పెట్టి మరీ ఉపన్యాసాలిస్తాం. గ్రూప్స్, సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో తెలుగును ఆప్షనల్‌గా తీసుకొని విజయం పొందినవారి ఇంటర్వ్యూలు చదివి వినిపిస్తాం. మాతృభాష ఔన్నత్యాన్ని వక్కాణిస్తాం. చివరకు ఉత్తరాలు రాసుకోడానికైనా మీకు తెలుగు సబ్జెక్టు పనికొస్తుందిగదా అంటూ దిగజారి మాట్లాడుతాం. సంస్కృతం విద్యార్థులను చూసి తరువాత మీరు సంస్కృతంలో మాట్లాడగలుగుతారా? అంటూ హేళన చేస్తాం. ఇదంతా మా ఉనికికి సంబంధించిన వ్యవహారం.

ఈ వాతావరణం మధ్య సౌమ్య మా క్లాస్‌లో అడుగుపెట్టింది. ఫస్టియర్ అంతా ఏమైందో తెలియదు! సెకండ్ ఇయర్‌లోనే తెలుగు క్లాస్‌కు రావడం మొదలెట్టింది. బిఎస్సీ ఇంగ్లీషు మీడియం చదివే తను మొదట్లో ఇద్దరు ముగ్గురు క్లాస్‌మేట్స్‌తో కలిసి వచ్చేది. ఆ తరువాత వాళ్లెవ్వరూ రాకపోయినా తను మాత్రం మానుకోలేదు. ఒక్కరికే క్లాస్ తీసుకోవడం కొంచెం ఇబ్బందే అయినా ఆ అమ్మాయి సిన్సియారిటీని కాదనలేక నేనూ క్లాస్‌కు వెళ్లేవాడిని. పాఠం చెప్తున్నంతసేపూ ఒద్దికగా కూర్చొని వినేది. అప్పుడప్పుడు అట్టవేసిన తన నోట్‌బుక్‌లో అర్థాలు నోట్ చేసుకునేది.

మిగతా విద్యార్థుల్లో లేని ఉత్తమ గుణాలను ఆ తర్వాత్తర్వాత నేను సౌమ్యలో గమనించాను. సౌమ్య అంకమైంది. తెలివైందేకాదు అణకువ. వినయం ఆమె సొంతం. కరెక్టుగా కొలతవేసినట్లుగా మాట్లాడుతుంది. నంగితనం మచ్చుకైనా కనిపించదు. హార్ట్‌ఫుల్‌గా స్పందిస్తుంది. ప్రవర్తిస్తుంది. కాలేజీ ఆవరణలో ఒకేరోజు నాలుగుసార్లు అనుకోకుండా ఎదురుపడ్డా రిసీవింగ్‌లో ఇబ్బంది పడదు. పడనివ్వదు. బహుశ... ఒక టీచర్ అయితేనే

తన పిల్లల్ని ఇంత సంస్కారవంతంగా పెంచగలదని నేను ఆమెను చూసి అనుకునేవాడిని.

సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, బయట జరిగే పోటీలకు విద్యార్థులను తీసుకెళ్లడం మాకు అడిషనల్ వర్క్‌గా ఉండేది. అన్నిటికంటే ముఖ్యం! హైదరాబాద్‌లో ప్రతి ఏడు జరిగే రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలకు విద్యార్థులను తీసుకెళ్లడం. ఈ పోటీలను భారీ ప్రాజెక్టుగా మా కళాశాల భావిస్తుంది. నెలల ముందుగానే ప్రిపరేషన్స్ స్టార్ట్ అవుతాయి. సౌమ్య మీద అలా ఏర్పడిన అభిమానం ఆమెను ఈ పోటీలకు తీసుకువెళ్లేలా చేసింది. ఆ సంవత్సరం, ఆ తరువాత సంవత్సరం జరిగిన పోటీల్లో సౌమ్య వివిధ అంశాల్లో పాల్గొంది.

మొదటి సంవత్సరం 'నేటి మహిళ' పోటీల్లో పాల్గొన్నప్పుడు తనకు బహుమతి రాలేదు. అయినా రోలింగ్ షీల్డ్ కాలేజీకి వచ్చింది. తనకు బహుమతి రానందుకు లోలోపల ఏమైనా బాధపడుతుందేమోనని నేనే ఓదార్పుగా ఆమెతో అన్నాను. "సౌమ్య నీకు కూడా బహుమతి వచ్చి ఉంటే..." అని. ఆమె చిన్నగా నవ్వి అంది 'కాలేజీకి పెద్ద బహుమతి వచ్చినప్పుడు నాకు వచ్చినట్లు కాదా సార్!' అని. ఆమె మాటల్లోని పరిపక్వత నాకు ఒకింత సంభ్రమాన్ని కలిగించింది.

రెండో సంవత్సరం ఒక మైమ్ ప్లేలో తనది అంధురాలి పాత్ర. బస్టాప్ దగ్గర నిలబడ్డ ఒక అంధురాలిని అంధురాలు అని తెలియక రోమియోలు ఆటపట్టించడం అందులో కథాంశం. విద్యార్థుల్లో రెండు రకాలవాళ్లు ఉంటారు. కొంతమంది క్లాస్‌కు సిన్సియర్‌గా వస్తారు. మరికొంతమంది ఎప్పుడు చూసినా పిట్టగోడల మీద కూర్చొని బాతాఖానీలు కొడుతూ కాలక్షేపం చేస్తారు. అలా అని వాళ్లను తక్కువ అంచనా వేయటం పొరపాటే. విపరీతమైన కల్చరల్ టాలెంట్స్ వాళ్లలో వుంటాయి. అందుకే అటువంటి వాళ్లను కూడా ఈ పోటీలకు తీసుకెళ్లడం తప్పనిసరి. బహుమతే లక్ష్యంగా వెళ్లే మాకు మరీ తప్పనిసరి.

అక్కడికి వెళ్లిన తరువాత పోటీలు జరిగే రాత్రిళ్లు కూడా రిహార్సల్స్ చేయించేవాళ్లం. సౌమ్య మా మాటే వేదంగా రిహార్సల్స్‌కు అంగీకరించేది. అటువంటి మూకల మధ్య ఆ అమాయకురాలిని చూడడం నాకు బాధాకరంగా ఉండేది. పోటీలు జరుగుతున్నంతసేపూ ఆ తరువాత మా ఉత్కంఠను, సంతోషాన్ని పసిగట్టి మాట్లాడుతూ ఓదార్పును, ఉత్సాహాన్నిచ్చే విద్యార్థికూడా ఆమే కావడం వల్ల సౌమ్య మీద అభిమానినికి తోడు గౌరవభావం నాకు పెరుగుతూ వచ్చింది.

** ** **

డిగ్రీ పరీక్షలు పూర్తవడం, వేసవి సెలవులు రావడంతో విద్యార్థులంతా ఎక్కడివాళ్లక్కడ గప్‌చిప్‌గా వెళ్లిపోయారు. సౌమ్య డిగ్రీ పరీక్షలు పూర్తవగానే పీజీ ఎంట్రన్స్‌లకు ఉపక్రమించింది. దారిలో ఎక్కడో కలిసి అదే విషయం చెప్పింది. ఆమె ప్రిపేర్ అవుతున్న నోట్స్‌ను రీసెర్చి స్కాలర్స్ మిత్రుల దగ్గర కలెక్టు చేసుకొని ఒకరోజు వాళ్లింటికెళ్లి ఇచ్చాను. ఆమె

**అన్నిటికి మించి ఆమె హృదయపూర్వకంగా స్పందించే తీరు నన్నెప్పటికప్పుడు ముగ్ధుణ్ని చేస్తూ, ఆమె పట్ల నా అభిమానం ఇనుమడించడానికి దోహదపడేది. నేను చదువుకున్న యూనివర్సిటీలోనే ఒక ఆత్మీయ స్నేహితురాలు చదువుకుంటుందన్న భావన నాలో ఏర్పడడానికి కూడా ఇదే కారణం.**

ఎంతో సంతోషించింది. ఆనందంతో తన పేరెంట్స్‌ను పరిచయం చేసింది. పరిచయం చేస్తున్నప్పుడే 'మీ ఫాదర్ టీచర్ అయ్యుంటారు?' అన్నాను సౌమ్యతో నా ఊహ నిజమో కాదో తెలుసుకుందామని.

ప్రస్తుతం ఖాళీగానే ఉన్నానని సౌమ్యకు బదులు వాళ్ల నాన్నే సమాధానమిచ్చాడు. ఆరోజు నా సహజధోరణితో హాస్యంచేసి వాళ్లందరిని నవ్వించాను. వెళ్లిపోయే ముందు ఇంటిముందున్న బోర్డును చూసి 'ఇక్కడ చీరెలకు రోలింగ్ చేయబడును, ఎవరట...?' అంటూ హాస్యం చేశాను.

ఎంట్రన్స్‌లన్నీ అయిపోయిన తరువాత నేనిచ్చిన నోట్స్‌ను తీసుకొని ఒకరోజు సౌమ్య కాలేజీకి వచ్చింది. తన ఎంట్రన్స్ అనుభవాలను నాతో పంచుకుంటున్నప్పుడే నెమ్మదిగా వాళ్ల ఫాదర్‌ను గురించి కదిపాను.

"సౌమ్యా! ఆరోజు మీ నాన్న ఖాళీగా ఉన్నానని చెప్పాడు అర్థంకాలేదు నాకు" అన్నాను. అప్పటివరకు ఉత్సాహంగా కబుర్లు చెపుతున్న ఆమె ఆ మాటతో గంభీరంగా మారిపోయింది. గుండెల్లో గూడు కట్టుకున్న విషాదాన్ని ఆ తరువాత కొంచెం కొంచెంగా వర్షించింది.

సౌమ్య వాళ్ల నాన్న ఒక ప్రయివేటు కంపెనీలో మంచి ఉద్యోగమే చేసేవాడు. ఉద్యోగం చేస్తున్నప్పుడే ఆ కంపెనీలోనే ఆయన యాక్సిడెంట్‌కు గురయ్యాడు. ఆ తరువాత ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఉద్యోగానికి రిజైన్ చేశాడు. అది తొందరపడి తీసుకున్న నిర్ణయం. మళ్లీ పిలుస్తారేమోననే ఆశతో చాలాకాలం ఎదురుచూశాడు. కాని ఆ అవకాశం మళ్లీ ఆయనకు రాలేదు. దీంతో మానసికంగా కొంత కుంగిపోయాడు. ఇప్పుడు ఆరోగ్యం బాగున్నా ఆయన ఏపని చేయడానికి మాత్రం ఇష్టపడడు. వ్యవసాయం అంటే ఆయనకు ప్రాణం. ఉద్యోగానికి ముందు చేసిన ఆ వ్యవసాయం చేయాలని ఇప్పుడున్నా, ఉద్యోగం చేస్తున్నప్పుడే సిటీలో ఇల్లు కట్టుకోవడంతో ఆ పనీ కుదరలేదు.

ఈ నేపథ్యంతో కూడిన కథనం ఆమె వినిపించి "ఇదేకదా సార్ మా దురదృష్టం" అంటూ ముగించినప్పుడు అప్రయత్నంగానే నా కళ్లు చెమర్చాయి. ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించే ఈ అమ్మాయిలో ఇంత విషాదం దాగివుందా అనిపించి ఆశ్చర్యం వేసింది. ఆరోజు వాళ్లింటికెళ్లినప్పుడు నేను చేసిన కామెంట్ గుర్తుకొచ్చి మరింత బాధపడ్డాను.

అప్పుడే వాళ్లకేదైనా సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను. ముఖ్యంగా వాళ్ల నాన్నతో ఏదైనా పని చేయించి, మళ్లీ ఆయనలో నూతనోత్తేజం తీసుకురావాలని నాకు అనిపించింది. అందులో భాగంగానే కొన్ని స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ వివరాలున్న పుస్తకాలను సౌమ్యకిచ్చి ఇంట్లో ఆ స్కీంల గురించి చెప్పమన్నాను. ఆ సమయంలోనే నేను వాళ్లింటివైపు ఇల్లు మార్చడంతో రెండుమూడుసార్లు నేనే స్వయంగా వెళ్లి చెప్పి చూశాను.

అయితే ఎందుకో వాళ్ల నాన్నకు నా సలహాలు కూడా రుచించలేదు. ఒకవేళ నా చొరవ పట్ల సందేహాలున్నాయేమోనని పించి అదే విషయం సౌమ్యను అడిగాను. ఆమె నా సందేహాన్ని సందేహంగానే కొట్టివేస్తూ "అయినా అటువంటిది ఏమైనా ఉంటే నేను చెప్తానుగా" అంటూ భరోసా ఇచ్చింది. ఆ తరువాత నేను చేసిన ప్రయత్నం కూడా సఫలీకృతం కాకపోవడంతో ఇక ఆ ఆలోచనను పూర్తిగా విరమించుకున్నాను.

ఈలోపు సౌమ్యకు ఎంసీఏలో రాంక్ రావడంవల్ల ఇక్కడి యూనివర్సిటీలోనే సీటు దొరికింది. తను అనుకున్నవి, ప్రిపేర్ అయినవి ఒకటైతే సీటు దొరికింది మరొక కోర్సులో. పైగా ఎంసీఏ డిమాండ్ ఉన్న కోర్సే అయినందున ఆమె సహజంగానే ఎక్కువ ఆనందానికి లోనైంది. 'ఇక మీకు రెగ్యులర్‌గా టచ్‌లో ఉండే అవకాశం లభించింది' అంటూ నా పట్ల గౌరవాన్ని, కృతజ్ఞతను అదే సందర్భంలో చాటుకుంది. ఆమెలో కలిగిన కొత్త ఉత్సాహానికి నేనూ ఎంతో సంతోషించాను. ఒక విద్యార్థితో అనుబంధం విద్యార్థిగా ఉన్నప్పుడేకాక అనంతరం కూడా కొనసాగడం ఏ అధ్యాపకుడికైనా ఆనందంగానే ఉంటుంది. అలా అని అది అందరితో సాధ్యమయ్యేది కూడా కాదు. మా మధ్య స్నేహం, ఆత్మీయత మొగ్గ తొడగడానికి ఇవన్నీ కారణమయ్యాయి.

యూనివర్సిటీలో చేరిన తరువాత కొత్త వాతావరణం, స్నేహితుల మధ్య తనూ... మళ్లీ రొటీన్‌గా కాలేజి బిజీలో నేనూ మునిగిపోవడం, పైగా మా దారులు కూడా వేరు కావడంవల్ల మేం కలుసుకునే అవకాశాలు సహజంగానే సన్నగిల్లాయి. ఎప్పుడో అరుదుగా కలుసుకున్నప్పుడు మాత్రం మామధ్య ఆత్మీయమైన పలకరింపులు, కబుర్లు సాగేవి. నేను యూనివర్సిటీలో ఎక్కడ ఎదురుపడ్డా తను విహంగంలా ముందు వాలి మాట్లాడేది. యూనివర్సిటీలో తన క్లాసు విషయాలు, క్లాస్‌లో తన మొదటిస్థానం నిలుపుకోవడానికి ప్రయత్నం, ఆందోళన అంతా ఆమె మాటల్లో దొర్లేవి. తన పాత కాలేజి సంగతులు, నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వచ్చిన బహుమతులను అడిగి తెలుసుకుంటూ తను ఇంక ఆ కాలేజి విద్యార్థినే అన్నట్లుగా ఫీలయ్యేది. అందుకు మేం పడుతున్న శ్రమను ప్రశంసిస్తూ మాట్లాడుతున్నప్పుడు కించిత్ గర్వం నాలో ఆవహించేది.

అన్నిటికి మించి ఆమె హృదయ పూర్వకంగా స్పందించే తీరు నన్నెప్పటికప్పుడు ముగ్ధుణ్ని చేస్తూ, ఆమె పట్ల నా అభిమానం ఇనుమడించడానికి దోహదపడేది. నేను చదువుకున్న యూనివర్సిటీలోనే ఒక ఆత్మీయ స్నేహితురాలు చదువుకుంటుందన్న భావన నాలో ఏర్పడడానికి కూడా ఇదే కారణం.

అయితే ఆమె మాట్లాడుతున్నంతసేపూ ఆమె మాటల్లో, ముఖంలో ప్రతిఫలించే సంతోషం, బాధను కొలవడం నాలో మరో పార్శ్వంగా సాగే అంశం. ఆమెను ఫలానా ఉద్యోగాలకు అప్లయ్ చేయించాలని లేక మా కాలేజీలోనే తనను లెక్చరర్‌గా చూడాలని ఇలా ఏదేదో... ఆమె భవిష్యత్తుకు సంబంధించిన అస్పష్ట ఆలోచనలు ఎప్పుడూ నా మనసులో మెదలుతుండేవి.

ఇలా పెనవేసుకుపోయిన మా స్నేహంలో అపోహలకు, అపార్థాలకు అవకాశం ఉంటుందని నేనెప్పుడూ అనుకోలేదు.

** ** **

సౌమ్య ప్రవర్తన నన్ను తీవ్రంగా కలచివేసింది. సంఘటన తరువాత రెండు రోజులు పూర్తిగా నేను నిద్రకు దూరమయ్యాను. అవమానభారంతో నా మనసు విలవిలలాడిపోయింది. ఆమెకు ఉత్తరం ఇవ్వాలనుకొని 'నా జీవితంలో మే 29 చాలా దురదృష్టకరమైన రోజు' అని, 'నువ్వు ఇచ్చిన గురుదక్షిణ నోబుల్ బహుమతికంటే గొప్పది' అని ఇలా ఏవేవో... పిచ్చి వ్యాఖ్యానాలు చేస్తూ ఆరోజు రాత్రి ఉత్తరం రాసి పెట్టాను. నాకున్న కొద్దిపాటి నాస్తిక భావాలను పక్కనపెట్టి ప్రశాంతత కోసం ఒకరోజు గుడికి వెళ్లాను.



## మళ్లీ పెళ్లాడను: డింపుల్

"ఇప్పుడు ఉన్న జీవితం హాయిగా ఉంది. మళ్లీ పెళ్లి చేసుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. అసలు ఎందుకు చేసుకోవాలి? జీవితంలో ఒక్కసారి పెళ్లి చేసుకుంటే వచ్చే అనుభవం చాలు. మళ్లీ పెళ్లాడాల్సిన పనిలేదు" అని డింపుల్ కపాడియా చెబుతోంది. ఇప్పటికీ ఉత్సాహంగా, నవ్వుతూ, తుళ్ళుతూ ఉండే డింపుల్ రాజేష్‌ఖన్నా మాదిరిగా జీవితంలో మరెవరితోనో సెటిల్ కావాలనుకోవడం లేదని చెప్పింది. ప్రస్తుతానికి ట్వింకిల్ ఖన్నా భవిష్యత్తు గురించే తను ఆలోచిస్తుంది. తనకు పాత్రల్ని ఆఫర్ చేసేవారిని తన కూతురికి అవకాశం ఇమ్మంటోంది. ఎంతయినా తల్లి మనసు కదా!

క్రమక్రమంగా నా మనసు శాంతించింది. నిప్పులు చిమ్ముకుంటూ నింగికి ఎగసిన ఉపగ్రహంలాగా ఆ తరువాత సౌమ్య ప్రవర్తనపై నా మనసు విశ్లేషణకు పూనుకుంది.

సరిగ్గా ఇరవై రోజుల క్రితం ఎటువంటి భేషజాలు వ్యక్తం చేయకుండా నాతో మాట్లాడి వెళ్లిపోయిన అమ్మాయి... "నా గురించి ఆలోచించడానికి మీరున్నారుగా..." అంటూ నా మీద అనంతమైన నమ్మకాన్ని, భరోసాను ప్రదర్శించిన ఈ అమ్మాయిలో సడన్‌గా ఈ మార్పేమిటి...? ఎంత ఆలోచించినా నాకు ప్రధానంగా కనిపించిన కారణాలు రెండే. ఆమె ఎవరినో ప్రేమించి ఉంటుంది! అతను మా సాన్నిహిత్యం మీద అమెరికా దేశంలా ఆంక్షలు విధించి ఉంటాడు అనేది ఆ కారణాల్లో మొదటిది. అదే నిజమైతే అంత సీరియస్‌గా చెప్పాల్సిన అవసరం తనకేముంది? ఏమో...! వాళ్ల మధ్య ప్రేమ తీవ్రత అంత బలంగా రిఫ్లెక్ట్ అయి ఉంటుంది! ఇది కౌంటర్ సమాధానం. కానీ పరీక్షల ముందు చాలా టెన్షన్‌కు గురైంది సౌమ్య. క్లాస్‌లో తన ఫస్ట్‌ప్లేస్ పోతుందేమోననే భయం, ఆందోళన ఆమె మాటల్లో ధ్వనించేది. పైగా బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరుగుతున్న సందర్భాలను కూడా నేనెప్పుడూ చూడలేదు. ర్యాంకుల తాపత్రయానికి, ఇటువంటి ప్రేమకు మధ్య పొత్తు కుదరడం కొద్దిగా కష్టమే! అందుకే ఈ సందేహం వెంటనే వీగిపోయింది.

ఇక అసలైన కారణంగా అనిపించింది రెండోదే. తను నాతో ఎప్పుడు మాట్లాడినా 'స్నేహితు'రాళ్ల' మధ్య నుంచే వచ్చిపోయేది. బహుశ వాళ్లే ఏదైనా కామెంట్ చేసుండాలి. మా ఆత్మీయత అర్థంకాక 'మీ లవరేమో?' అని ఉంటారు. ఈ అమ్మాయిలో మొదటిసారిగా అనుమానబీజం మొలకెత్తి ఉంటుంది! ఇన్నాళ్ల పరిచయాన్ని, స్నేహాన్ని అదే కోణంలో ఆలోచించుకొని ఒక్కసారిగా అపార్ట్‌మెంట్‌లా కూలిపోయి ఉంటుంది! గౌరవనీయుడు, ఆత్మీయుడు అనుకున్న వ్యక్తి పెద్దరికం ముసుగులో వస్తున్న ప్రేమికుడు, మోసగాడు అని తెలిసినప్పుడు సహజంగానే ఆందోళనకులోనై ఉంటుంది. పరీక్షల ముందు తలెత్తిన సమస్యకావడంవల్ల డిస్టర్బ్ అయి నా మీద మరింత ద్వేషాన్ని పెంచుకుందేమో! అందుకే ఆరోజు ఆమె మాటల్లో, ప్రవర్తనలో అంత కాఠిన్యం ఉట్టిపడింది.

ఏదిఏమైనా స్నేహితుల కామెంట్స్‌ను తను నమ్మడం నాకు జీర్ణం కాలేదు. ఈ విభజన రేఖను మూడోవ్యక్తి అర్థం చేసుకోవడం, వ్యాఖ్యానించడం కొద్దిగా కష్టమే. అలా గనుక వాళ్లు కామెంట్ చేసే ఉంటే రెండు దేశాల స్నేహ సంబంధాలలో మూడోదేశం తలదూర్చినట్లే అవుతుంది. ఇది పూర్తిగా మా అవగాహనకు సంబంధించిన అంశం. అటువంటప్పుడు తన వివేచనశక్తి ఏమైంది? తను అనుకుంటున్నవి అపోహలో కాదో తెలియనప్పుడు నాకు మాట్లాడే అవకాశం ఇచ్చి నివృత్తి చేసుకోవలసిన బాధ్యత తనకు ఎందుకు లేదు! అప్పుడు తీవ్రమైన మనస్తాపంలో ఉండి ఉంటుందనుకున్నా తరువాత అయినా నాకు ఎందుకు చెప్పలేదూ? ఈ అపోహలు తొలగిపోవడం కూడా తనకు ఇష్టంలేదా? స్నేహితుల కామెంట్స్‌ను తట్టుకోవడానికైనా నన్ను బాధ పెట్టడానికి సిద్ధపడిందా? ఇది మంచోచెడో ఎందుకైనా మంచిదని ఈ స్నేహాన్ని ఇంతటితో ఆపెయ్యాలని నిర్ణయించుకుందా? ఇలా ఆలోచిస్తున్నప్పుడు ఎందుకో నా గుండెలు దడదడలాడాయి. ఇదే నిజమైతే... ఎంత స్వార్థం తనది...? ఒక ఆత్మీయుడిని కోల్పోతున్నానన్న భావనే తనలో లేదా? ఏమో...? యూనివర్సిటీ పరిచయాలు... ముఖ్యంగా కొద్ది గ్యాప్‌నే తరం గ్యాప్‌గా ఫీలవుతున్న నవతరం కంప్యూటర్ విద్యార్థుల మధ్య తనిప్పుడు ఉంది. దీనికితోడు జీవితం మీద ఒక నమ్మకం కూడా ఇప్పుడు ఏర్పడుతుంది కాబోలు.. స్థిరత్వ భావనలు తనలో పాదుకుంటున్న కొద్దీ నామీద అభిమానం క్రమంగా దూరం అవుతూ ఉండవచ్చు. ఈ పరిచయాన్ని అవుననలేక కాదనలేక కొంతకాలం సంకటస్థితిని ఎదుర్కొందేమో? ఈలోపు తలెత్తిన అపోహలు ఒక పరిష్కారాన్ని చూపి ఉంటాయి. ఈ మార్పును, పరిణామాన్ని నేను గమనించకపోయుంటాను! ఈ తర్కబద్ధ ఆలోచనలతో మళ్లీ నా మనసు వేడెక్కింది. సౌమ్య తన అయిష్టాన్ని మరోరకంగా సూచించినా ఎంత బాగుండు అనిపించింది. ఊరటకోసం మిత్రుల సలహా తీసుకోక తప్పలేదు. వాళ్లు నేనూహించినవే చెప్పినా, అదనపు సమాచారాన్ని వాటికి జోడించారు. మొదటి మిత్రుడు నేపథ్యం చెప్పగానే పెద్దగా నవ్వి "ఇవన్నీ మాకు కాలేజీ రోజుల్లో మామూలే... మీరు ఎందుకు అంతగా ఆలోచిస్తున్నారూ...?" అన్నాడు ఇదసలు సమస్యే కాదన్నట్లుగా.

పరీక్షల ముందు చాలా టెన్షన్‌కు గురైంది సౌమ్య. క్లాస్‌లో తన ఫస్ట్‌ప్లేస్ పోతుందేమోననే భయం, ఆందోళన ఆమె మాటల్లో ధ్వనించేది.

నేను కొంచెం తేరుకొని "మీరన్నది నిజమే, కాని కాలేజీ రోజుల్లో విద్యార్థుల మధ్య ఉండే పరిచయాలు, వ్యవహారాలు వేరు. ఇక్కడ స్టూడెంట్ అయిన వ్యక్తికి నాకూ తలెత్తిన సమస్యగదా?" అన్నాను సమస్యను అర్థం చేయించే ప్రయత్నం చేస్తూ.

ఇది సెంటిమెంట్ కేసు అనుకున్నాడేమో! వెంటనే తన ధోరణి మార్చి చెప్పడం మొదలుపెట్టాడు. "ఈ లేడీస్ ఒక్కొక్కసారి అర్థం అవుతారు. ఒక్కొక్కసారి అసలే అర్థంకారు" అన్నాడు మొదటి వేదాంతిలా.

మళ్లీ అతనే కొనసాగిస్తూ "ముఖ్యంగా సానుభూతి, జాలి ఎక్కువైనట్లు అనిపిస్తే అసలే జీర్ణం చేసుకోలేరు. మూడునాలుగు సార్లు కలుసుకోగానే ఇక తమకోసమే తిరుగుతున్నట్లు ఫీలయిపోయి వెంటనే అపార్థం చేసుకుంటారు. ఈ సమయంలో యాదృచ్ఛికంగా ఎదురుపడ్డామా! ఇక సరేసరి... అయినా మీకు పెళ్లై ఉంటే ఈ సమస్యే ఉత్పన్నం అయ్యేదికాదుగదా?" అంటూ ముగించాడు. ఆయన అన్న చివరి మాటకు నవ్వే వచ్చింది నాకు. నిజమేనేమో! ఇక్కడ ఉద్యోగాలకు మళ్లే మనిషికీ మనిషికి మధ్య నమ్మకానికి కొన్ని అర్హతలుండాలి కాబోలు... మనసులోనే అనుకున్నాను. మరో మిత్రుడు ఆంజనేయస్వామి భక్తుడు. అయినా నాకు మిత్రుడే. విషయం వినగానే గుక్క తిప్పుకోకుండా వాళ్ల ప్రాపర్ ఫలానా... వాళ్ల నాన్న ఫలానా కంపెనీలో ఉద్యోగం చేసేవాడూ అంటూ అచ్చుగుద్దినట్లే చెప్పడం మొదలుపెట్టాడు. ఆశ్చర్యపోవడం నావంతు అయింది. "మీకు ఆ కుటుంబం ముందే తెలుసా" అన్నాను రెట్టింపు ఆసక్తితో. "లేదు సిక్స్త్‌సెన్స్" అంటూ నా ఉత్సాహాన్ని మరింత పసిగట్టిన వాడిలా మళ్లీ ఎత్తుకున్నాడు. "ఆ అమ్మాయిది కోల ముఖం" అన్నాడీసారి.

నాకు ఆమె ముఖం ఎలా ఉంటుందో వెంటనే అర్థంకాక, ఏమనాలో కూడా తెలియక తికమకపడుతూ 'కొంచెం' అని గొణిగాను. నాముందే ఒక కాయిన్ పైకి ఎగరేసి "కొలీగ్స్ కామెంట్స్ వల్లనే ఆ అమ్మాయి ఇలా చేసింది" అంటూ తేల్చేశాడు. కొద్దిసేపు ఆయనతో మళ్లీ ఏం మాట్లాడాలో నాకు అర్థంకాలేదు. ఆ తరువాత నేనే కదిలిస్తూ "ఇవన్నీ నమ్మకాలకు సంబంధించిన విషయాలు గదా?" అన్నాను. ఆ మాటతో ఇహలోకంలోకి వచ్చినట్టున్నాడు. "ఇందులో అంత ఆలోచించి బాధపడాల్సిందేముంది? మీ అభిమానం చూరగొన్న ఒక వ్యక్తి అభ్యున్నతికి పాటుపడాలనుకున్నారు. తను అర్థం చేసుకోలేదు. దానికి మీరేం చేస్తారు? అర్థం చేసుకోలేకపోయినందుకు తను బాధపడాలిగాని, ముందుముందు అర్థం చేసుకుంటుందేమో వేచి చూద్దాం" అంటూ ముగించాడు. ఆ మాటలతో నాకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది.

** ** **

సంఘటన జరిగి రెండేళ్లయింది. ఈలోపు నాకు పెళ్లైంది. సౌమ్య ఎంసీఏ కూడా పూర్తయింది. ఈమధ్యకాలంలో సౌమ్య నేనూ ఎక్కడ ఎదురుపడ్డా చూసుకుంటూ వెళ్లడమే తప్ప ఎప్పుడూ మాట్లాడుకోలేదు. ఆమె కనిపించినప్పుడు మాత్రం రేఖమాత్రంగా నాలో బాధ మెదలుతుండేది. అయితే సౌమ్యలో క్రమక్రమంగా మార్పు వచ్చింది. మునుపటిలాగా మళ్లీ నాతో సాన్నిహిత్యంగా ఉండడానికి ప్రయత్నిస్తోంది. ఉంటుంది కూడా... ఎక్కువ పశ్చాత్తాపానికి గురైందేమో ఇప్పుడు కాలేజికి కూడా వచ్చి మాట్లాడుతోంది. ఉండబట్టలేక ఒకరోజు సౌమ్య గురించి మా ఆవిడతో గొప్పగా చెప్పాను.

ఇదే సమయంలో మేం రెండుమూడు సార్లు స్కూటర్ మీద వెళుతున్నప్పుడు సౌమ్య ఎదురుపడి నాతో సాన్నిహిత్యంగా మాట్లాడడాన్ని మా ఆవిడ అదే పనిగా గమనించింది. సౌమ్యతో మాట్లాడిన మరొక రోజు ఇంటికి తిరిగొచ్చిన తరువాత మా ఆవిడ అన్నమాట విని నేను నిజంగానే నిశ్చేష్టుడినయ్యాను.

"మీరిక ఆవిడతో మాట్లాడకండి ప్లీజ్" అంది గోముగానే. నాకు మొదట అర్థంకాలేదు. జోక్ చేస్తుందేమోననుకున్నాను. కాని తను నెమ్మదిగానే అన్నా సీరియస్‌గానే అంటోందని అర్థం అయిన వెంటనే నరాలు తెగ్గోసిన ఫీలింగ్ కలిగింది. 'అయినా ఎందుకూ...?' అని అడగలేకపోయాను.

ఎందుకంటే! తను కూడా ఆ భావజాలంలోని వ్యక్తే. శ్రీమతి కావడం వల్ల ఈమె కొంచెం ప్రేమ ముసుగులో చెప్పగలిగింది. ఆమె పరాయి స్త్రీ కావడం వల్ల ఎటువంటి ముసుగు లేకుండా చెప్పింది. ఇద్దరి మధ్య ఉన్న వ్యత్యాసం ఇంతే... ఎందుకో అప్పుడు సలహా చెప్పిన మిత్రుడు గుర్తుకొచ్చాడు. ఆయన కలిసినప్పుడు జరిగిన విషయం చెప్పి నవ్వుతూనే అడిగాను 'పెళ్లైతే ఇటువంటి సమస్యలు ఉండవన్నావుగా' అన్నాను.

ఆయన చెప్పిన సమాధానం విన్న తరువాత మరింత అవాక్కవకుండా ఉండలేకపోయాను. "అవును పెళ్లి చేసుకొమ్మన్నానుగాని, ఎడ్యుకేటెడ్‌ను ఎవరు చేసుకోమన్నారు?" అన్నాడాయన తాపీగా టీ తాగుతూ.

ఆయన చమత్కారం కోసమే అన్నా అందులో ఏదో అర్థం ఉందనిపించింది ఆ క్షణంలో నాకు.

అన్ ఎడ్యుకేటెడ్‌ను ఆయన గుర్తుచేయగానే నాకు నా పల్లె గుర్తుకొచ్చింది. పల్లెల్లో బహుశా ఇటువంటి సమస్యలు తలెత్తినప్పుడేనేమో దయ్యం పట్టిందనుకొని వేప మండలతో కొట్టేవాళ్లు. ఆ సమస్యలు అంతటితో సమసిపోయినట్లుగా అనిపించేవి. ఈ నాగరిక వాతావరణంలో ఆ అవకాశం కూడా లేదు. ఏదిఏమైనా మానవ సంబంధాలన్నీ ఎప్పుడూ ఒక అంచుపైనే ప్రయాణిస్తుంటాయి. ఆ అంచుపైన సోడా సీసాలోని గోలిలా అటూ ఇటూ కదిలేదే 'అపార్థ భావన'. ఒకరకంగా అది యాక్సిడెంట్ కూడా. మన ప్రమేయం ఏం లేకుండానే ఒక్కొక్కసారి అది మనల్ని బాధపెడుతుంది. ఇలా అనుకున్నాక ఇక నా మనసు పూర్తిగా తేలికపడింది. ●



## మరో విలక్షణపాత్రలో కమలహాసన్!

'తెనాలి' తర్వాత మరో చిత్ర నిర్మాణంలో కమలహాసన్ బిజీగా ఉన్నారు. ఈసారి తాను పదిహేనేళ్ల కిందట రాసిన నవల ఆధారంగా ఆయన సినిమా తీస్తున్నారు. ఇందులో ప్రధాన పాత్రధారి ఆయనే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ చిత్రాన్ని తమిళంలో, హిందీలో ఒకేసారి నిర్మిస్తున్నారు. 'అభయ్' పేరుతో హిందీలో విడుదలయ్యే ఈ చిత్రంలో కమల్‌హాసన్ నగ్నంగా నటిస్తున్నారు. ఈరకంగా ఇదొక సంచలనంగా ఉంది. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా వ్యవహరించడం వల్ల కొత్త నటులు ఎందరు వస్తున్నా కమలహాసన్‌కు ఉన్న ఆదరణ తగ్గలేదు. 'అభయ్' చిత్రంలో రవీనా టాండన్ ఆయన సరసన నటిస్తోంది.